క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శనివారం ఉదయం 10 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తమ సమస్యలను 73827 81490 నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చని తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



స్వామివారికి అభిషేకించేందుకు పంచామృతాలు తీసుకు వెళుతున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులకు పండ్లు, స్వీట్ల పంపిణీ



ఏలేశ్వరంలో దివ్యాంగ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ఏలేశ్వరం: పట్టణంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు దాతలు వితరణ చేశారు. పట్టణానికి చెందిన సామంతుల భాస్కరరావు తన కుమారుడు స్వాతిక్ జ్ఞాపకార్థం దివ్యాంగులకు బిస్కెట్లు, పంపిణీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరీటి, మహిళా సంఘం సభ్యులు కొప్పుల ఇందిరా, సూర్యకుమారి ఆర్థిక సాయంతో అల్లికలకు సంబంధించిన వైర్లు, ధారాలు అందజేశారు. కార్యక్రమంలో కోరాడ రాజు, ఉడతల రమణారావు, భవిత సిబ్బంది పద్మజ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల తనిఖీ



పేరవరం పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ అబ్బాయి

ఏలేశ్వరం: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ అబ్బాయి సూచించారు. మండలంలోని పేరవరం ఎంపీపీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచితే అనారోగ్య సమస్యలు రావన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాసరావును పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బాలరాజు, ఉపాధ్యాయులు సుందరరావు, సత్యవేణి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి



రామచంద్రపురంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని రామచంద్రపురం సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో డిజిటల్ అసిస్టెంట్ల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. నిర్ణీత గడువులోగా మండలంలోని రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈఓపీఆర్డీ మార్కొండేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

కిర్లంపూడి: తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఆశా వర్కర్లను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడానికి నిరసనగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు బొడ్డేటి రమణమ్మ, కుమారి, భాగ్య మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా మహిళా పోలీసులు ఆశ వర్కర్లను నిర్బంధించారన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న తమను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ బి.ఆశయ్యకు వినతి పత్రం అందజేశారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ప్రత్తిపాడులో మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు

- ఎమ్మెల్సీ అనంతబాబు
- ప్రత్తిపాడులో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

ప్రత్తిపాడు: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలు నమూనా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2014లో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మహిళలను మోసం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా ఆసరా సొమ్ములు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఒకప్పుడు వైఎస్సార్, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలా అగ్రపీటం వేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని 1373 డ్వాక్రా సంఘాలల్లోని 13,591 మంది సభ్యులకు నాలుగో విడతగా రూ.10,55,88,949 చెక్కును వరుపుల సుబ్బారావు అందజేశారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు చిట్టుమూరి లోవకుమారి, కల్లూరి పద్మ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలు ఎమ్మెల్సీ అనంతబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఏపీఎం వై.వెంకట్, ఈఓపీఆర్డీ కె.కాశీవిశ్వనాథం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, సొసైటీ అధ్యక్షులు దోశ హరిబాబు, జువ్వల బాబులు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు



గండేపల్లిలో మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గండేపల్లిలో మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోటనరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం డ్వాక్రా మహిళలకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక 124 సార్లు బటన్ నొక్కి 2.55 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. జన్మభూమి కమిటీలు, దళారుల బెడద లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, పార్టీ నేతలు కుంచే చినబాబు, తారకం, ఎండీఓ హనుమంతరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరంలో లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి రాజా పంపిణీ చేశారు. తుని నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు చెందిన 32 మందికి రూ.29.32 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అత్యవసర వైద్యం చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఆత్మ కమిటీ చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, తుని మండల పార్టీ అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన మంత్రి గుమ్మనూరు



మంత్రి గుమ్మనూరు జయరాంకు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్ శాఖల మంత్రి గుమ్మనూరు జయరాం శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు. మంత్రి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

11న మేరీమాత యాత్ర మహోత్సవం



ప్రత్తిపాడు మరియగిరిపై మేరీమాత

ప్రత్తిపాడు: స్థానిక మరియగిరిపై ఈ నెల 11న మేరీమాత యాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం చర్చి ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ కె.చిన్నప్ప దివ్యబలిపూజ నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి మరియగిరి వరకూ పుర ప్రదక్షిణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహోత్సవంలో క్రైస్తవ సోదరులు, మఠకన్యలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రత్తిపాడు హైవేపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ శ్రీనివాసు



బెండపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌హెచ్ఏఐ సేఫ్టీ అధికారి వర్మ

ప్రత్తిపాడు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వాహన చోదకులకు శుక్రవారం అధికారులు వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. కత్తిపూడి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లు, కార్లపై ప్రయాణించే వారికి హెల్మెట్, సీటుబెల్టు వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్‌తో ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులకు, సీటు బెల్టు ధరించిన కారు డ్రైవర్లకు చాక్లెట్లు ఇచ్చారు. హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ ధరించకుండా ప్రయాణించే వారికి గులాబి పువ్వు అందజేసి, వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కత్తిపూడి ఏఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో గతేడాది రోడ్డు ప్రమాదాల్లో 297 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని కారణంగానే నెలకు సగటున 25 మంది చనిపోతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మినర్వా డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రత్తిపాడు పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

తొండంగి: వచ్చే పదేళ్లలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎన్‌హెచ్ఏఐ (కృష్ణవరం టోల్ ప్లాజా) సేఫ్టీ అధికారి వర్మ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బెండపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచిచారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ మూర్తి, ఐఎంటీ మేనేజర్ విజయ్‌బాబు, ఇంచార్జ్ దనకుమార్ రూట్ పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు దత్తాత్రేయ శర్మ, వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 95 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు



ఏలేశ్వరంలో ప్రజలకు కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు



బూరుగుపూడిలో పల్లెకు పోదాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాట్ల కృష్ణవర్మ

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పట్టణంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు, జిల్లా సభ్యుడు గట్టెం వెంకటరమణ, వెలుగూరి హరేరామ్, కురాకుల రాజా, ఏనుగు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లలగుంటలో బీజేపీ పల్లెకు పోదాం

జగ్గంపేట/కిర్లంపూడి: మండలంలోని గొల్లలగుంటలో శుక్రవారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నియోజవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో బీజేపీ నాయకులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లా రాము, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొత్త శ్రీనివాస్ రెడ్డి, ముల్కి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మతల్లి జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- ఐదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్తిపాడులో కొలువైన సత్తెమ్మతల్లి అమ్మవారు

ప్రత్తిపాడు: గ్రామంలో వేంచేసిన సత్తెమ్మతల్లి 45వ జాతర మహోత్సవాలను శనివారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఏటా ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు శనివారం ఉదయం వంశీకులు మేళతాళాల నడుమ అమ్మవారిని తీసుకువచ్చి గద్దెపై నిలిపే ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు ఇంద్రజాల (మేజిక్ షో) ప్రదర్శన ఏర్పాటు చేశారు. 11న శంఖవరం మండలం కత్తిపూడి విఘ్నేశ్వర సాయిదుర్గా నాట్యమండలి వారితో 'బతుకు చిత్రం' సాంఘిక నాటకం, 12న కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు, అమ్మవారి పూలగరగ సంబరం, 13న సినీ మ్యూజికల్ నైట్, చివరి రోజు 14న అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

గిరిజనుల కష్టాలకు చెక్

- రూ.6.6 కోట్లతో శంఖవరం–వేళంగి రహదారి నిర్మాణం
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు



వేళంగిలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అనంతబాబు, వరుపుల

శంఖవరం: శంఖవరం–వేళంగి రహదారి నిర్మాణంతో గిరిజనుల కష్టాలు తీరుతాయని ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరం నుంచి వేళంగి వరకూ సుమారు 20 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం వారు శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.6.6 కోట్లతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డు సమస్యతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే రూ.6.6 కోట్లు మంజూరు చేయించారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికే అందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, రౌతులపూడి జెడ్పీటీసీ గొల్లు చిన్నదివాణం, సర్పంచులు ఈగల విజయదుర్గ, గుండు సుధారాణి, మేకల సుబ్బయ్యమ్మ, బొట్టా చైతన్య, సకురు గుర్రాజు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, పార్టీ నాయకులు గాబు కృష్ణ, వాసిరెడ్డి భాస్కరబాబు, వాసిరెడ్డి జమీలు తదితరులు పాల్గొన్నారు.

నులిమేద్దాం

- ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొమ్మనాపల్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి రవికుమార్ తదితరులు



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినికి ట్యాబ్లెట్లు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: నులిపురుగుల నివారణతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పాతకొట్టాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, సబ్‌యూనిట్ అధికారి మధు, హెచ్‌వీ జ్యోతి పాల్గొన్నారు.

రక్తహీనత సమస్యను తగ్గించేందుకే..

తొండంగి: పిల్లల్లో నులిపురుగులను నివారించి రక్తహీనత సమస్యను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం డీ వార్మింగ్ డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ అన్నారు. కొమ్మనాపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం డాక్టర్ పి.భారతి, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల కారణంగా జీర్ణవ్యవస్థ దెబ్బతింటుందన్నారు. నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 2890 మంది పిల్లలు ఉండగా 2723 మందికి మాత్రలు వేసినట్టు తెలిపారు. కేపీ పురం పీహెచ్‌సీ పరిధిలో 5700 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్టు డాక్టర్ కె.రవి తెలిపారు.

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 9,200 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి వి.రాజబాబు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

97 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గోకవరం: మండల వ్యాప్తంగా 97 శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 14,672 మంది విద్యార్థులతో ట్యాబ్లెట్లు మింగించామన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, మందపాటి సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక ఎంఆర్ పేట ఫీడర్ పరిధిలో చెట్ల నరికివేత, రోడ్డు క్రాసింగ్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ రత్నాలరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని గొల్లపేట, దుర్గాదాసు వీధి, మల్లిబాబు వీధి, దివాణంవీధి, బాలాజీరోడ్డు, పెద్దపండా వీధి, బెల్లపువీధి, మొండి వీధి, పాతబజార్ వీధి, వేంకటేశ్వరస్వామి టెంపుల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్తిపాడు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక మరమ్మత్తుల కారణంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఏ ఎం.రాజశేఖరం తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఏలూరు, ఒమ్మంగి, కిర్లంపూడి మండలంలో కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, సింహాద్రిపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.